# ఓ కుక్క కథ

టేక్సీ, ఆటోరిక్షా – ఏదీ యెంతసేపటికీ దొరక్కపోవడంతో – సైకిల్ రిక్షా స్థాయికి దిగజారక తప్పలేదు. అయిష్టంగానే ఆ నిర్ణయానికి వచ్చి ఎదురుగా చూశాను. రోడ్డు కవతలపక్క రిక్షా ఆగింది. ఎవరో దిగారు. నాగరికత పెరిగి నదుపాయాలు పెరగని అనేక పట్నాల్లో విశాఖపట్నం ఒకటి. మామూలు మనిషి జీవితంలో లాగ నగరం నిండా మిట్టపల్లాలే. ఎంత సైకిల్ రిక్షా అయినా – వాడు అప్పెక్కిస్తుంటే రిక్షాలో సుఖంగా కూర్చోగలగడానికి చాలా మానవత్వాన్నీ హృదయాన్నీ చంపుకోవాలి. అందుకే ఆ ఊళ్ళో టాక్సీయో, ఆటోరిక్షాయో తప్ప యిష్ట పడను.

రిక్షావాలా సోడా తాగడానికి కాబోలు పాన్‌షాప్‌కి వెళ్ళాడు. చిల్లర తెచ్చుకుందుకయినా కావచ్చు. నేను రిక్షాదగ్గరకు నడిచాను. అతను వొచ్చేశాడు.

"జెమినీ పార్క్... వెనక వీధి..."

"ఎక్కండి బాబూ..."

"ఎంత?"

"కష్టం తెలిసిన మారాజులు. మీకు దయకలిగినంత యివ్వండి."

ఈ అనిశ్చయం నాకిష్టముండదు. కమ్యూనిజం యెంత కంకణం కట్టుకున్నా ఎక్స్‌ప్లాయిటేషన్ (దోపిడీ?) అనేది పూర్తిగా జీవితంనుంచి పోదు. తీరా నేను దిగాక వాడు చాలా ఎక్కువకు కానీ అంగీకరించక గొడవచేయవచ్చు. నలుగురి దృష్టినీ ఆకర్షిస్తూ సీనులో నిలబడ్డం నాకసహ్యం

"రెండు రూపాయలు." కచ్చితంగా అన్నాను.

"తమ దయ."

రిక్షావాళ్ళలో మంచివాళ్ళుండరనే అమానుషుణ్ణి కాను. కాని – ఏ మనిషి మంచివాడో చూడగానే తెలుసుకుందుకు నా దగ్గర సాధనమేమీ లేదు.

ఎక్కాను.

రిక్షా కదలబోతూంది.

హఠాత్తుగా నా రిక్షాలోకి...

"ఏమిటిది?!" చిరాగ్గా అడిగాను.

"కుక్క బాబూ"

"పెంచుతున్నావా?"

"నేను కాదు బాబూ; ఎవరో"

"మరి?"

"మధ్యాహ్నం ఇరానీ హోటల్లో రొట్టె తిని, టీ తాగి బయటకు వచ్చానంతే. ఎక్కడినుంచి వచ్చిందో నా మీదకు ఎగబడింది. జాలిపడి రొట్టె కొనివేశాను. అంతే నన్ను వదలడం లేదు. కుక్క మనిషి కాదుకద బాబూ! ఓ పట్టాన యిశ్వాసం చంపుకోదు"

ఆ చివరిమాట వెనుక చాలా కథ ఉండి ఉండాలనిపించింది రిక్షావాడి ముఖం చూశాను. వాడు వెనక్కి తిరిగినప్పుడల్లా అందానికి అతి దూరంగా ఉన్నాడు.

యౌవనంలో రిక్షావాలాకీ పెళ్ళయింది. అదృష్టవంతుడుకనుక చాలా అందమైన భార్యదొరికింది. (సాధారణంగా అందమూ, అనాకారితనమూ కుదురుకుంటూ వుంటాయి. దాంపత్యంలో) తన ముద్దుల భార్యను చూసుకుంటూ ఆమె ఆనందం కోసం యెంతో కష్టపడి రిక్షామీద ఎక్కువ సంపాదించి ఆమె గురించి ఖర్చు చేసేవాడు. పువ్వులూ, చీరలూ... మేకప్ సామానులూ, సినిమాలు... కోసం రక్తాన్ని రూపాయలుగా మార్చేవాడు. ఆమె రిక్షా వాడి పెళ్ళామే అయినా పువ్వుల రాణిలా జీవించేది.

స్త్రీ చంచల కదా !

ఆమె మనసు అటూ యిటూ పరుగులెత్తింది. ఒక రిక్షావాడికి పెళ్ళాంగా పడి ఉండట మేమిటని అతను కొనిచ్చిన అద్దమే నవ్విందామెనూ ఆమె అందాన్నీ చూసి. ఎక్కడ అందం ఉంటుందో, అక్కడ స్టూడెంట్లూ, లాడ్జింగ్ ఓనర్లూ, సినీ బ్రోకర్లూ ఉండక తప్పరు కదా? ఆ అందం మేడల్లోకాక మారుమూల గుడిసెలలో ఉంటే!

వలలు విసరబడ్డాయి.

కలలు తలుకులీనాయి. మాటలు కోటలు దాటాయి.

ఇంద్రజాలం పరచుకుంది.

గుడిసె దాటాలే కాని సరాసరి బంగారు సినిమా మేడలలోనే కాపురం అని వొక్కి వక్కాణించేశాయి పరిస్థితులూ, పెద్దమనుషులూ.

మొగుడి చెమటతో తాను చూసిన రంగుల సినిమాలు రా రమ్మని ఎలుగెత్తి పిలిచాయి.

అంతే.

గూటిలో గువ్వ ఎగిరిపోయింది. ఎక్కడికో, ఎవడితోనో.

గూడు చిన్నబోయింది.

రిక్షావాడి గుండెల్లో తీరని వెలితి, ఆరని మంటలు.

ఆడదంటే అసహ్యం, పగ... కసి... పశ్చాత్తాపం.

మళ్ళీ ఆడదాన్ని తెచ్చుకోకుండా మోడు బ్రతుక్కి మెడవంచాడు. అంత చేసినా విశ్వాసం లేకుండా తనని ఒంటరి వాణ్ణి చేసిపోయిన పెళ్ళాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ, ఏకాంతంలో ఏడ్చుకుంటూ.

ఇదే అయ్యుండాలి అతని కథ. అందుకే ఆ చివరిమాట.

"తమకి చిరాగ్గా ఉంటే చెప్పండి బాబూ. కుక్కని కిందకి తోలేస్తాను. ఐనా నన్నొగ్గదులెండి, నాతోటే పారొస్తుంది."

"....."

"జాతికుక్కే బాబూ. ఊరకుక్క కాదు."

దాన్ని పరికించాను.

అందంగా ఉంది. హుందాగానూ ఉంది. మెడమీద బొచ్చు కింద తోలు పటకా.

"పెంపుడు కుక్కలా ఉందే !"

"అయ్యుండాలి బాబూ." ఒక నిమిషం ఆగి మెల్లగా అన్నాడు.

"తమరి కిసుగురాదంటే చెబుతాను బాబూ... విని సలహా యిద్దురుగాని."

"చెప్పు" సిన్సియర్‌గా విందామనికాదు. ఎలాగూ రిక్షాలో ఊరికే కూర్చున్నాను. వాటి మాటలు వింటే ఏం?

"ఇరానీ హోటల్లో టీ తాగాక ఈ కుక్క ఎక్కడినుంచి వచ్చిపడిందో మీదకు ఎగబడింది. ఓ రొట్టె అరువు తీసుకుని పడేశాను దానిముందు. పొద్దుటినుంచీ బేరాలు లేవు. ఆకలి తీరడం మాట అటుంచి, అద్దె కట్టాలి. అదీ బాధ.

కుక్క పెద్ద తెలిసినదానిలా వెళ్ళి రిక్షాలో కూర్చుంది.

ఆశ్చర్యంగా ఇద్దరు స్టూడెంట్లు రిక్షా ఎక్కారు.

"ఎవరిదోయ్ కుక్క!"

"తెల్దు బాబులూ, ఎవరిదో?"

"కుక్క బాగుందోయ్. మాకిచ్చేస్తావా?"

"మీరేటి సేసుకుంటారు?"

"చాలా పనుందిలే..." అని వాళ్ళిద్దరూ తమలో తాము మాట్లాడుకోసాగారు.

"కొంతమంది అమ్మాయిలు కుక్కల్నీ – కుక్కలు గల అబ్బాయిలనీ ప్రేమిస్తార్రా. ఉదాహరణకు కుక్క కలిపిన కాపురం, నీ జూలీకూడా ఆ కోవకి చెందిందేమో! మనుషులందిస్తే ముఖం ముడుచుకునే అమ్మాయిలు కొందరు కుక్కలు తెచ్చిన ప్రేమలేఖలు కులాసాగా అందుకోవడమేకాదు. కాక్ష్యూర్‌గా ప్రేమిస్తారు కూడా !

ఈ కుక్క అందంగానే వుంది. తెలివైనది లాగే కనిపిస్తోంది. మన అదృష్టం అదే నీ ప్రేమ విషయం పరీక్షించుకుందామా?"

"కానియ్... ప్రేమకోసం ఏ పాట్లయినా పడాలకదా!"

రిక్షా దిగాక వాళ్ళు శతవిధాల దాన్ని తీసుకువెళ్ళడానికి ప్రయత్నించారు. కాని అది లొంగలేదు. సున్నితంగా తన అయిష్టాన్ని సూచించింది. వాళ్ళు జబర్దస్తీచేయబోగా తనకూ గోళ్ళూ, పళ్ళూ ఉన్నాయి ఆయుధాలని తెలియజెప్పింది. వాళ్ళే తోక ముడిచారు.

ఈ సారొకామె నా రిక్షా ఎక్కింది.

రిక్షాలో కుక్క! కొంచం వింతే.

కుక్క గురించి కుశల ప్రశ్నలు వేసింది. చివరకు "దీన్ని నాకిచ్చెయ్, జాగ్రత్తగా పోషించుకుంటాను. రౌడీల నుంచి, పోలీసులనుంచీ నాకు రక్షణ దొరుకుతుంది. అదీకాక యిటువంటి కుక్క గుమ్మంలో ఉంటే నాకూ డిమాండూ రేటూ పెరుగుతాయి." అందామె.

ఆమె సానిదని వేరే చెప్పాలా బాబూ?

"నీ కివ్వడానికి నేనెవర్ని? ఆ కుక్క నాది కాదని చెప్పానుగా?"

అడంగుకు చేరుకుని దిగుతూ ఆమె కుక్కను బుజ్జగించింది... బ్రతిమాలింది. ససేమిరా కుక్క ఆమె వద్దకు వెళ్లలేదు. ఇంట్లోంచి తాడు తీసుకురాబోతే కుక్క పరుగులంకించుకుంది.

ఋణానుబంధం తీరింది కాబోలని రిక్షా నడిపించసాగాను. ఎక్కడినుండి వచ్చిందో ఎప్పుడెక్కి కూర్చుందో – రిక్షాలో!

"ఏయ్ రిక్షా"

ఈసారి ఓ పెద్దమనిషి ఎక్కాడు. వాటం చూస్తే పింఛనీ తీసుకుంటున్న పోలీసాఫీసర్లా ఉన్నాడు. కుక్కని జరిపి కూర్చుని "మంచి కుక్కని పెంచుతున్నావురా! ఇంత మంచి కుక్క నీకెందుకు? దీన్ని పోలీసు డిపార్ట్‌మెంట్ కిచ్చేయ్. జాగ్రత్తగా తయారుచేస్తారు. ఎక్కడ దొరికిందిరా యిది? అరె! అల్సేషియన్ కాదు, బుల్‌డాగ్ కాదు. బ్లడ్‌హౌండ్ కాదు... గమ్మత్తుగా ఉందే. ఏ క్రాస్ బ్రీడో!"

రిక్షా దిగేవరకూ కుక్కని పరీక్షిస్తూనే ఉన్నాడతను. నేను నిజం చెప్పేశాను.

"ఐతే నేను దీన్ని తీసుకుపోయి డి.వై.ఎస్.పి. కిస్తాను. అలాగయితే సరయిన చోటుకి చేరుకుంటుంది."

"తమ చిత్తం. నాకంతకంటె కావలసిందేముంది? పోలీసు డాగ్‌ని చేసెయ్యండి తమ కిష్టమయితే."

లాభం లేకపోయింది.

ఆ కుక్క అతని వెంట వెళ్లలేదు.

మొండికెత్తింది.

మొరాయించింది. రిక్షావదిలిరానంది."

కథ వింటున్న నాకు యిందాక ఆలోచించిన కథకి ముగింపు దొరికినట్లయింది.

గూడు విడిచిన గువ్వ అందం ఆరిపోయే వరకూ అయినవాళ్ళ చేతుల్లోనూ, కానివాళ్ళ కాళ్ళకిందా నలిగింది. చివరకు రోగాలూ, దరిద్రమే మిగిలాయి. సినిమా తెరమీద రంగుల బొమ్మలు త్వరగా మాయం ఐపోయి తెరే మిగిలినట్లు. దిక్కు లేని చావు చచ్చింది. అట్టే వయసు మీర కుండానే. ఆ చివరి క్షణాల్లో ఆమెకు గతం గుర్తుకొచ్చింది. పువ్వుల్లో పెట్టి పెంచిన పెనిమిటి మెదిలాడు మనసులో సెంటిమెంటల్‌గా. ఈ జన్మకి నిప్పెట్టుకున్నాను. చచ్చి – మళ్ళీ జనమెత్తాక నీకు సేవజేసుకోనీ అని కన్నుమూసింది.

ఆమె ఆ ప్రార్థన ఫలితమే ఈ కుక్క జన్మ.

అందుకే కుక్క యితన్ని వదలక పోడం. ఔనౌనౌను. ఇది కథ వ్రాయాలి. గొప్పగా, బహుమతి పొందేలా.

"బాబూ, ఎండగా ఉంది. కలర్ తాగుతారేటి? కిళ్ళీకొట్టుకాడ ఆపేదా?" రొప్పుతున్నాడు రిక్షావాడు.

"నువ్వెళ్ళి సోడాతాగిరా."

సోడా తాగొచ్చేలోగా కుక్కకి కృతజ్ఞతలు తెలుపుకున్నాను. ఓ చక్కని కథకి ప్లాట్ ఇచ్చినందుకు.

"సిత్రవేటంటే బేరం తరువాత బేరం. యిరామవే లేదు. అందుకే బాబూ అలసిపోయాను. ఆ... యీ సారి... ఎవరంటే... ఆ... ఓ సినిమా మనిషెక్కాడు బాబూ..."

"సినిమావాళ్ళు రిక్షాలెక్కుతారా!"

"కారు అర్ధాంతరంగా సెడిపోతే ఏటి సేత్తారు? స్టుడియోలు ఊరికవతలే ఉంటాయి. అడవిలాటి చోట అద్దాంతరంగా మోటరుకారాగిపోతే ఫోను చెయ్యడానికికైనా అరమైలు పోవాలి. సినిమావోళ్లు సినిమాల్లోనే కష్టాలు జూపిస్తారు కాసులు నొల్లుకుందుకు. అంతేతప్ప ఆళ్లు అడుగుదీసి అడుగెయ్యరు. అలాగ ఆ సుకుమారం సినిమాబాబు నా బండెక్కాడు. కుక్కని చూశాడు. కులాసా ఎత్తిపోయాడు. మరి దాని ముఖంలో ఏంఉందో ఏమో! గొప్ప కుక్క బాబు. అందరూ ముద్దు జెయ్యడవే గాని కసురుకున్న వాళ్ళు లేరు.

కుక్క గురించి వాకాబు చేశాడు.

ఉన్నదున్నట్లు పూసగుచ్చినట్లు చెప్పాను.

"లక్... కారు చెడిపోవడం... కుక్క తగలడం నా దశ తిరిగిపోడానికే. కుక్కని నాకిచ్చెయ్. కుక్క మనసులనే సినిమా బొమ్మ తీసేసి కిందటి బొమ్మలో వొచ్చిన నష్టాన్ని పూడ్చేసుకుని లాభాల్లాగేస్తాను. కావాలంటే వందో పాతికో పట్టుకుపో. కుక్కని చూస్తే హీరో, హీరోయినూ, విలనూ, ప్రొడ్యూసరు కూడా ప్రేమించేస్తారు. ఈజీగా డిస్ట్రిబ్యూటర్లు దొరుకుతారు." సంబరపడిపోయాడు.

"నాకెందుకు బాబూ, వందా, పాతికా? అది యిష్టపడితే ఊరికేనే తీసుకుపోయి బొమ్మతీసుకోండి. బొమ్మలో జూసి నేనూ ఆనందపడిపోతాను."

గాడీ దిగుతూ కుక్కని పిలిచాడు.

అతనెంత గింజుకున్నా అది దిగలేదు. చివరకు గుర్రుమంటూ అతన్ని భయపెట్టి పొమ్మనేసింది. నాకు నవ్వొచ్చేసింది.

ఔను. కొన్ని కుక్కలు ఎలక్షన్ల ముందు అభ్యర్థులలా తెగ అరచి గోలచేసి ప్రాణాలు తీస్తాయి సమయమూ సందర్భమూ లేకుండా. కొన్ని కుక్కలు అరవ్వు. కరుస్తాయంతే; ప్రాక్టికల్ డాగ్స్.

"ఇంతకీ కుక్కనేం చెయ్యదలుచుకున్నావు?" అడిగాను.

"అదే ఆలోసిత్తున్నాను. కుక్క యజమాని దగ్గరకు పోయేటట్టు నేదు. జరిగిన సంగతులు జూశాక బంగారంలాంటి కుక్కని మధ్యమనుషుల కివ్వ బుద్ధవడం లేదు..."

"ఓపని చెయ్యి".

"సెప్పండి."

"ఇలా ఓ కుక్క దొరికిందనీ యజమానులు వచ్చి తీసుకువెళ్ళ వలసిందనీ పేపర్లో వేయించడమో రేడియోలో చెప్పించడమో చెయ్యి."

“ఆ చిక్కులు నాకేటి తెలుస్తాయి.”

“చిక్కేముంది?”

రిక్షావాలా మాట్లాడలేదు. మౌనంగా ఉండిపోయాడు.

వాడి మనసులోనూ ఆలోచనలు కొత్త తోవలో పరుగులు తీస్తున్నాయి. మెదడు తీవ్రంగా పనిచేస్తూంటే శరీరం మందగిస్తుంది కాబోలు. రిక్షా వేగం తగ్గింది.

ఈ కుక్క ఏ క్షణంలో తన రిక్షాలో వచ్చి కూర్చుందోకాని, బేరం తరువాత బేరం... డబ్బులు బాగా కిడుతున్నాయి. అదృష్టాన్ని తెచ్చే కుక్కలా ఉంది. కోడలొచ్చిన వేళా, గొడ్డొచ్చినవేళా అంటారు. తనకిమాత్రం కుక్కొచ్చినవేళ చాలా బాగుంది. దీన్ని తనే ఉంచేసుకుంటే?

“పోనీ... ఏ పోలీసుస్టేషనుకో తీసుకు వెళ్ళి అప్పజెప్పేయ్.” అన్నానే కాని, నా మాటమీద నాకే నమ్మకం లేకపోయింది. కుక్కని తీసుకుని రిక్షావాడు పోలీస్టేషనులో అడుగు పెట్టబోతూంటాడు. అంతే అదిగో మా కృష్ణ.” అంటూ దంపతులు చూస్తారు స్టేషన్లోంచి.

“దొంగ వెధవ మా కృష్ణని ఎత్తుకుపోయాడు...”

వాళ్ళు గొప్పవాళ్ళు కనుక పోలీసులు ఆఫీసర్లూ వాళ్ల పక్షం. అంచేత కుక్కని లాక్కుని రిక్షావాణ్ని లాఠీలతో బాదుతారు. పోలీసులు ముందూ వెనుకా చూడరు. కనుక రిక్షావాడు మాట్లాడదామన్నా మర్రెండు తగలనిస్తారే తప్ప వినిపించుకోరు.

రిక్షావాడు స్పృహతప్పి రక్తం కారుతున్న ఒంటితో స్టేషనులో పడుంటాడు. కుక్క యజమానులతో ఓడంత కారులో స్టయిల్‌గా కూర్చునివెళ్లిపోతుంది బారుకో, షికారుకో.

ఔను కుక్క కథ అలాగే ముగుస్తుంది.

రిక్షావాడు కుక్కనుంచేసుకుంటే... ఫ్చ్ ఉండదు. రిక్షావాడు దానికి మాంసం కొని పెట్టలేడు. స్నానాలు చేయించలేడు. బాగా పెంచలేడు. అంచేత అది వాడిదగ్గర ఉండదు.

నా ఆలోచనలు సాగుతూనే ఉన్నాయి.

హటాత్తుగా కుక్క రిక్షామీంచి గెంతి రివ్వున శరంలాగా ఓ యింట్లోకి దూసుకుపోయింది. నేనూ రిక్షావాలా తెల్లబోయి చూస్తున్నాము.

ఆ యింటి గేటుమీద బోర్డు.

“కుక్క ఉంది జాగ్రత్త!”

దెబ్బ తిన్నాను.

నేనెందుకు ముగింపు ఆలోచించలేక పోయాను.?

రిక్షావాడు ఆలోచించలేక పోయాడు.

కుక్క మా ఆలోచనల కలీతంగా తన కథని తానే సుఖాంతం చేసుకుంది.

✡ ✡ ✡ ✡ ✡